క్లుప్తంగా

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలను నిర్వహించగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ప్రతి గురువారం స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని, ఉభయదాతలు పూజలో పాల్గొని తరలించాలని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

82 మందికి కంటి పరీక్షలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. నగరంలోని శంకర నేత్ర చికిత్సాలయ వైద్యులు, ఆప్తమాలజిస్ట్‌లు మొత్తం 82మంది భక్తులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా మందిరం పాలక మండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవలతోపాటు సామాజిక సేవలో భాగంగా బాబా మందిరానికి విచ్చేసే భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా 40ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కనీసం 6 నెలలకు ఒక సారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందిరం పాలక మండలి సభ్యులు, సాయి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గనగర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు కలశజ్యోతులను సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామరావు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 14వ తేదీ శనివారం కలశజ్యోతుల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఏర్పాట్లను ఈవో రామరావు గురువారం పరిశీలించారు. కనకదుర్గనగర్ నుంచి గోశాల వరకు రోడ్డుకు ఒక వైపున జ్యోతులను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను ఈవో పరిశీలించారు. మహామండపం మార్గంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతోపాటు భవానీలకు తాగునీరు, అమ్మవారి దర్శనంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఏర్పాట్ల వివరాలను దేవస్థాన ఈఈ వైకుంఠరావు ఈవోకు వివరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై అక్రమ కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత గొడవల నేపథ్యంలో వ్యక్తిగతంగా చోటుచేసుకున్న వివాదంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తను ఇరికించడమే కాకుండా అతనిపై హత్యయత్నం కేసు నమోదు చేసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం లంబాడీపేటకు చెందిన మాకిన విజయ్ గతంలో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించాడు. ఆ సమయంలో విజయ్, టీడీపీ నాయకుడు నాగోతి రామారావుకు ఆర్థికపరమైన వ్యవహారాలలో వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే మూడేళ్ల కిందట విజయ్ వైఎస్సార్ సీపీలో చేరారు. దీంతో టీడీపీ నాయకులు ఎలా అయినా విజయ్‌ను ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించసాగారు. బుధవారం రాత్రి నాగోతి రామారావు తన పార్టీ కార్యాలయంలో ఉండగా, అతనిపై నిమ్మల కార్తీక్ అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారంలో నాగోతి రామారావుకు గాయాలు కాగా, విజయ్ ప్రోత్సాహంతోనే ఈ దాడి జరిగిందని భావించిన రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పార్లమెంటు నియోజకవర్గ ముఖ్యనేతతోపాటు కొందరు స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడి కారణంగానే పోలీసులు విజయ్‌పై హత్యయత్నం కేసు నమోదు చేశారనే చర్చ లంబాడిపేట ప్రాంతంలో జోరుగా సాగుతోంది.

ఆదమరిస్తే.. అంతే సంగతులు

- మూతలు లేనిచోట్ల చెట్ల కొమ్మలు, కర్రలే దిక్కు
- ఆందోళనలో భవానీపురం వాసులు

ప్రమాదఘంటికలు మోగిస్తున్న డ్రైనేజీ మూతలు



40వ డివిజన్ పరిధిలోని దాసాంజనేయస్వామి గుడి పక్క వీధిలో దెబ్బతిన్న సిమెంట్ దిమ్మెలు



భవానీపురం క్రాంబే రోడ్డులో డ్రైనేజీపై మూతలు లేకపోవడంతో కొమ్మలు, చెక్కలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీపై ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్ మూతలు తొలగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఆదమరచి కాలు వేస్తే అంతే సంగతులు అన్నట్లుగా తయారైంది పరిస్థితి. కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారగా, ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులు..

డ్రైనేజీకి మూతలు లేని చోట చెట్ల కొమ్మలు, చెక్క ముక్కలు, కర్రలు పెట్టి కార్పొరేషన్ సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. భవానీపురంలో ప్రధాన రహదారికి ఇళ్లకు మధ్య ఉన్న ఈ డ్రెయిన్లపై మూతలు లేకపోవడంతో పాదచారులు, స్థానిక నివాసితులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భవానీపురంలోని ప్రధాన రహదారులను అందంగా తీర్చిదిద్దింది. మార్జిన్లను విస్తరించి డస్ట్ ఫ్రీగా మార్చింది. డ్రైనేజీలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టింది. కోట్లాది రూపాయల నిధులతో భవానీపురం ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. డ్రైనేజీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కొత్త అవుట్ ఫాల్ డ్రెయిన్లను నిర్మించింది. వాటిపై పేపర్ బ్లాక్స్ ఏర్పాటు చేసి అవసరమైన చోట్ల మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసింది. నివాసాలు ఉన్న చోట డ్రెయినేజీ ఎక్కడా కూడా ఓపెన్‌గా లేకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా భవానీపురం క్రాంబే రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజ్ కాలువను చక్కగా తీర్చిదిద్దింది. పేపర్ బ్లాక్స్ ఏర్పాటు చేసి పాదచారులు వాకింగ్ చేసినా ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.

40వ డివిజన్‌లో పరిస్థితి అధ్వానం..

40వ డివిజన్‌లోని దాసాంజనేయ గుడి పక్క రోడ్డులో డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు ధ్వంసమైపోయాయి. వాటికి ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు పైకి కనిపిస్తున్నాయి. రెండు రోడ్లు కలిసే చోట పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ రాకపోకలకు కాల్వపై ఏడు పెద్ద దిమ్మలు వేస్తే వాటిలో రెండు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక రాత్రి వేళల్లో బైక్‌లు, సైకిళ్లు వేసుకుని వచ్చే వారు ఇక్కడ దెబ్బతిన్న సిమెంట్ దిమ్మెలు గుర్తించక ఇబ్బందులుపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజీలపై మూతలు, ఓపెన్ డ్రెయిన్లపై రోడ్లు కలిసే చోట కొత్త సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యం...

గతంలో అవుట్ ఫాల్ డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్ మూతలు అక్కడక్కడ పాడైపోయాయి. కొన్ని పూర్తిగా పగిలిపోయాయి. మరికొన్నింటిని సిబ్బంది తొలగించారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. మూతలు తీసినచోట తాత్కాలిక ఏర్పాటు కింద చెట్టు కొమ్మలు, చెక్క ముక్కలు, కర్రపుల్లలు అడ్డుపెట్టారు. అంతేతప్ప మూతలు పెట్టలేదు. దీంతో అవికాస్తా ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దానిపై నడుస్తూ ఎవరైనా ఆదమరిచి అడుగు వేశారా? అంతే సంగతులు. పైగా ఈ రోడ్డుకు ఆ చివరి నుంచి ఈ చివరి వరకు స్కూల్స్ కాలేజీలు ఉన్నాయి. ఇళ్లల్లోంచి బయటకు వచ్చే వారు సైతం డ్రెయినేజీ దాటి రోడ్డు మీదకు రావాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల ఇంటి గేట్లకు ఎదురుగా ఉన్న మ్యాన్‌మూతలు శిథిలమైపోయాయి. ఆయా ప్రాంతాల్లో నివాసాల వాళ్లు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఎక్కడ పిల్లలు, పెద్ద వాళ్లు నడిచేటప్పుడు కాళ్లు పడతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఎంఐజీ 2, కొండవీటి కల్యాణ మండపం, ప్రియదర్శిని కాలనీ, చర్చి సెంటర్ వద్ద డ్రెయిన్‌పై మూతలు పూర్తిగా ధ్వంసమై పోయాయి.

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో ఎస్‌సీఆర్ఎంయూ హవా



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) 47.46 శాతం ఓట్లు సాధించి విజయ కేతనం ఎగురవేయగా, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ (ఎస్‌సీఆర్ఈఎస్) 42.91శాతం ఓట్లుతో రెండస్థానంలో తమ గుర్తింపు నిలబెట్టుకుంది. 11ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ ఎన్నికల్లో పలు కార్మిక సంఘాలు తమ గుర్తింపు సాధించేందుకు ఎన్నికల బరిలో నిలిచాయి. హోరాహోరీగా ప్రచారాలతో ఉద్యోగులకు ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేశాయి. అయితే ఈ ఎన్నికల బరిలో నిలిచిన డీఎంఆర్‌కేఎస్, ఐఆర్ఎంయూ, ఆర్ఎంయూ గుర్తింపు సాధించలేకపోయాయి. డివిజన్ వ్యాప్తంగా 17,577 మంది ఓటర్లకుగాను 15,661మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీటిలో ఎస్‌సీఆర్ఎంయూ 7,679 ఓట్లు సాధించగా, ఎస్‌సీఆర్ఈఎస్ 5,997 ఓట్లతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా పూర్తయినట్లు సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ తెలిపారు. డివిజన్‌లోని 37 కేంద్రాలలో సీసీ టీవీలు ఏర్పాటు చేసి ఏపీఓ అధికారితో మానిటరింగ్ చేయడంతోపాటు ఆర్పీఎఫ్, జీఆర్పీ, జిల్లా పోలీసులతో ప్రత్యేక బందోబస్తు, ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఎన్నికల విధుల్లో ఒక అధికారితోపాటు మొత్తం 111 మంది సిబ్బంది పాల్గొన్నట్లు ఆనంద్ తెలిపారు.

జక్కంపూడి రైతులకు న్యాయం చేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతిన మహేష్



రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న పోతిన మహేష్

విజయవాడరూరల్: ల్యాంకో, మేఘ సంస్థలకు వందలాది కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతిన మహేష్ ఆరోపించారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలో రైతుల పొలాల్లో అక్రమంగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ల పనులను బాధిత రైతులు, ప్లాట్ల యజమానులతో కలిసి పోతిన మహేష్ గురువారం పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన చోట్ల హైటెన్షన్ వైర్స్ లైన్స్ క్రాస్ చేయాల్సి ఉందన్నారు. లైన్ మార్పు చేస్తున్నామని, ఏ రైతు పొలం పోతుందో కనీసం అధికారులు నోటిఫికేషన్ లేదా పేపర్ ప్రకటన ఇవ్వలేదన్నారు. రైతుల నుంచి భూములు లాక్కోవాలనే ప్రయత్నం చాలా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమా, ఎంపీ కేశినేని చిన్ని రైతుల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామసభలు బాగా జరిగాయని చెప్పినా జక్కంపూడి రైతుల పీకల మీద కత్తి పెడుతున్నామని ఎందుకు చెప్పలేదన్నారు. కలెక్టర్ రైతులతో కమిటీ వేయాలని, చర్చించి తర్వాత నిర్ణయం తీసుకోవాలన్నారు. రైతులు, ప్లాట్ల యజమానులకు ముఖ్యమంత్రి చంద్రబాబు న్యాయం చేయాలన్నారు.

వరద బాధితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలి : సీపీఎం



రెవెన్యూ సదస్సు సమీపంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద బాధితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గ రెవెన్యూ సదస్సులో భాగంగా గురువారం గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన సదస్సు బయట సీపీఎం ఆధ్వర్యంలో వివిధ అంశాలపై ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ బుడమేరు వరద కారణంగా పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 13 డివిజన్లు ముంపునకు గురి అయ్యాయన్నారు. ఆయా డివిజన్ల ప్రజలు ఆస్తినష్టంతోపాటు, వాహనాలు ఇతర అనేక గృహపరికరాలను నష్టపోయారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వరద బాధితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని 10 కొండ ప్రాంత డివిజన్ల ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. 12 మైదాన ప్రాంత డివిజన్‌లలో నివాస గృహాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. నివాస గృహాల ద్వారా బ్యాంకుల నుంచి తగిన రుణ సహాయం పొందుటకు అవకాశం కల్పించాలని రెవెన్యూ సదస్సులో అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. నగరంలో అర్హులైన నివాస స్థలాలులేని నిరుపేదలకు రెండు సెంట్లు నివాస స్థలం కేటాయించాలని కోరారు. అర్హులందరికీ సామాజిక పింఛన్ ఇవ్వాలన్నారు. షేక్ రాజా హాస్పిటల్‌ను వంద పడకల హాస్పిటల్‌గా అభివృద్ధి చేయాలని కోరారు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, నాయకులు ఈవీ నారాయణ, కె.సూరిబాబు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని మైనార్టీల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత షేక్ బాజీ షాహీద్ గురువారం నేషనల్ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహెజాదీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షాహీద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్‌ల నెలవారీ జీతభత్యాలు అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో మైనార్టీలకు అవసరమైన నిధులను తక్షణం కేటాయించి అమలు చేయాలని కోరారు. ఉర్దూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకం తదితర అంశాలపై వివరించారు. వక్ఫ్‌బోర్డు ద్వారా పేదలకు సహకారం అందించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరారు.

దుర్గమ్మ సేవలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ రాంగోపాల్‌నాయుడు గురువారం కుటుంబసమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రాంగోపాల్‌నాయుడిని ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

యూపీహెచ్‌సీ పరిసరాలు శుభ్రం



నిన్నటి వరకు ముళ్లపొదలతో ఉన్న ఆసుపత్రి



ముళ్లపొదలను తొలగించిన తరువాత ఆవరణ

సాక్షి ఎఫెక్ట్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): బాప్టిస్ట్‌పాలెం యూపీహెచ్‌సీలో నెలకున్న సమస్యలపై 'సాక్షి' దినపత్రిక బుధవారం ప్రచురించిన 'బాబోయ్..బాప్టిస్ట్‌పాలెం యూపీహెచ్‌సీ' కథనానికి అధికారులు స్పందించారు. యూపీహెచ్‌సీ చుట్టుపక్కల పరిసరాల్లో మొలచిన ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగింపజేసి రోగుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టారు. రోజూ మూడు షిఫ్టులలో పారిశుద్ధ్య సిబ్బంది ఆసుపత్రి చుట్టూ పరిసరాలను శుభ్రపరిచేలా తగిన ఏర్పాట్లు చేసినట్లు స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ తెలిపారు. ఆరు నెలలుగా నెలకున్న సమస్య పరిష్కారం కావడంతో ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి' దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.లక్షల్లో వ్యయం.. లక్ష్యం శూన్యం..



లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి సేవలు అందించేందుకు గత ప్రభుత్వం కృషి చేస్తే కూటమి ప్రభుత్వం లక్ష్యాన్ని నీరు గార్చే విధంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొబైల్ వాహనాల ద్వారా హెచ్ఐవీ పరీక్షలతో పాటు, పాజిటివ్ బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఈ ఏడాది జనవరిలో ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో 15 ఐసీటీఎస్ వాహనాలు కొనుగోలు చేశారు. వాటి రిజిస్ట్రేషన్స్ పూర్తి చేసి, ప్రారంభించే నాటికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో సిద్ధార్థ వైద్య కళాశాలలో వాహనాలు పార్కింగ్ చేశారు. ఎన్నికల అనంతరం కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. దీంతో వాహనాలు ప్రారంభించకుండానే తుప్పుపట్టే స్థితికి చేరాయి. ఆధునిక వసతులు ఉన్న ఒక్కో వాహనం సుమారు రూ. 30 లక్షల వరకూ వ్యయం ఉంటుంది. ఆ లెక్కన 15 వాహనాలు రూ.4.50 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసినా ప్రభుత్వం నిరుపయోగంగా ఉంచింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఆ వాహనాలు వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

–లబ్బీపేట(విజయవాడతూర్పు)

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్



బెలూన్లు ఎగురవేస్తున్న డీఆర్ఎం తదితరులు



విద్యార్థుల క్రీడా విన్యాసాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలను జీవితంలో అంతర్భాగంగా మలచుకోవాలని రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ పిలుపునిచ్చారు. కేంద్రీయ విద్యాలయ నెంబర్ వన్‌లో గురువారం 37వ క్రీడా వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయంలో క్రీడాకారులు భవిష్యత్తులో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. తొలుత ప్రిన్సిపల్ ఆదిశేష శర్మ స్వాగత ఉపన్యాసం చేయగా వ్యాయామ ఉపాధ్యాయుడి టి.ఏడుకొండలు వార్షిక నివేదిక సమర్పించారు. విద్యార్థులు పిరమిడ్‌లో టైక్వాండో మణాలతో సహా పలు సాంస్కృతిక క్రీడా విన్యాసాలు ప్రదర్శించారు. విద్యార్థులు మార్చ్ పాస్ట్ చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. వార్షిక క్రీడా దినోత్సవం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల గౌరవ వందనంను నరేంద్ర ఏ పాటిల్ స్వీకరించి బెలూన్‌లను గాలిలోకి వదిలారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులు ఆస్తిక్ (ఆర్చరీ), ధీరజ్ (స్కేటింగ్), శ్రీ అంగీత (ఆర్చరీ), అభిరామ్ (స్కేటింగ్), దీరజ్ (స్కేటింగ్), ఈక్షిత (స్కేటింగ్), లక్ష్మీనారాయణ (స్కేటింగ్), జాన్సన్ (స్విమ్మింగ్), మనోహర్ (స్కేటింగ్) ను డాక్టర్ కిరణ్ కుమార్ రైల్వే డిపార్ట్‌మెంట్ ఏపీవో అనిరుద్ అభినందించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనాట్యాంజలి కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు గురువారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై మాగులూరి త్రినాధచారి పర్యవేక్షణలో 12మంది కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఆలయ ఈవో కెఎస్.రామరావు అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

చిన్నారులకు కంప్యూటర్ పాఠాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ కంప్యూటర్ అక్షరాస్యతను కలిగి ఉండాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు ఎస్డీ జరీనాబేగం, ఎస్ వరలక్ష్మి సూచించారు. కళాశాల ఎస్ క్లబ్, ఎంబీఏ విభాగాల ఆధ్వర్యంలో పాతబస్తీలోని వివిధ ప్రభుత్వ పాఠశాల్లో కంప్యూటర్ సాక్షరతను అందించే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో చుట్టూత ఉన్న పాఠశాల్లో కంప్యూటర్ అంశాలపై అవగాహన కలిగించి వారికి ఆరంగంలో ఆసక్తిని, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో చిన్నారులకు కంప్యూటర్ ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తూ ఆయా రంగాల వైపు వారికి ఆసక్తి పెరిగేలా పనిచేస్తున్నట్లు వివరించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.